International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-2, April - June, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# మల్లవరపు జాన్ - జీవితం, సాహిత్యం

(1927-2006)

డా॥ ఎల్లే విజయానందరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు. సెల్ : 9441088634

తొలితరం దళిత కవులలో 'మధురకవి'గా ప్రసిద్ధి పొందిన మల్లవరపు జాన్ ఈతరం కవులకు అంతగా పరిచయం లేకపోవచ్చు కానీ జాషువానంతర పద్య కవులకు సుపరిచితులే. ఈయన 22 జనవరి 1927లో ప్రకాశం జిల్లా, చీమకుర్తి అనే గ్రామంలో రత్నమ్మ, దేవిడ్ అను పుణ్యదంపతులకు జన్మించారు. తెలుగు భాషాప్రవీణ (ఆంధ్రా యూనివర్సిటి) పూర్తి చేసి, కర్నూలులో తెలుగు పండిట్ ట్రైనింగ్ పొందారు. ఆ తరువాత ప్రథమ శ్రేణి తెలుగు పండితునిగా పనిచేసి, 1985లో పదవీవిరమణ చేశారు. కొంతకాలానికి అనగా 12 ఆగష్టు 2006న ఈ లోకాన్ని విడిచి కీర్తిశేషులైనారు. ధర్మవరపు లక్ష్మీనారాయణ గారు వీరికి విద్యాబుద్ధులు నేర్పిన గురువు.

"రచనా విధానముకన్నా రచయిత యొక్క సత్తువ ప్రధానమైనదని" (నామాట – విశ్వప్రకాశము) చెప్పిన మల్లవరపు జాన్ **'సాంసన్-డెలీలా'** (1967), **'విశ్వ ప్రకాశం'** (1973), **'అతుకుల బ్రతుకులు'** (1981), **'సూక్తి శతకం'** (1991), **'కాంతి రేఖలు'** (1987), **'సరసవినోధిని'** (1991), **'భావ విపంచి'** (1996), **'చిరస్మరణీయులు'**, **'పుణ్య పురుషుడు'**, **'ప్రబోధ గీతాలు'**, **'భక్త విజయం'**, **'ఎయిడ్స్‌రోగి'**, బుర్రకథ మొదలగు రచనలు ఛందోబద్ధమైన సరళశైలిలో రచించారు. వీరి ప్రతిభను గుర్తించి అనేక సన్మానాలు, సత్కారాలు వీరిని వరించాయి. అందులో 1987లో **'ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు'**, తల్లావజ్ఝల శివశంకర స్వాముల వారిచే **'మధురకవి'** బిరుదు, ఒంగోలులో విశ్వనాథ సత్యనారాయణ గారిచే సత్కారం, తెలుగు విశ్వవిద్యాలయపు బెజవాడ గోపాలరెడ్డి దర్శనిధి పురస్కారాలు పేర్కొనదగినవి. అంతేకాకుండా **'కవిభూషణ'** బిరుదు కూడా వీరిని వరించింది. ఇంకా చెప్పాలంటే వీరు రచించిన 'అతుకుల బ్రతుకులు' అనే ఖండకావ్యాన్ని మైసూరు విశ్వవిద్యాలయం వారు B.Ed. పాఠ్యగ్రంథంగా ప్రవేశపెట్టారు.

**విశ్వ ప్రకాశము (1973) :**

ఇది ఇరవై ఖండికల సంపుటి. ఇందులో **'ఆంధ్రమాత'** మొదటి ఖండిక కాగా **'రతనాల మాలిక'** చివరిది. పద్య, గేయాలతో కూడిన ఈ రచనలో కవిగారు అనేక అంశాలను ప్రబోధించారు. **'ఆంధ్రమాత'** ఖండికలో ఆంధ్రప్రదేశ్‌లోని కవితా, కళా, భాషా, సాంస్కృతిక, రాజ్య వైభవాలకు కారకులైన వారిని కీర్తించటం ప్రధాన అంశం. **'అస్పృశ్యత'** ఖండికలో అగ్రవర్ణ దురహంకారాన్ని నిందించారు. ముఖ్యంగా హరిజనులను హీనంగా చూచే అగ్రవర్ణాల మనస్తత్వాన్ని నిలదీశారు. విష్ణు పాదాలనుండి పుట్టిన గంగ పవిత్రమైనదైతే బ్రహ్మపాదాల నుండి జన్మించినట్లు చెప్పబడుతున్న అతి శూద్రులైన హరిజనులు అంటరానివారెందుకయ్యారని వాదించారు. ధనవంతుల ఇళ్ళలో కుక్కకు కూడా మనిషి హోదా లభిస్తుందని, దళితులకు సమాజంలో గౌరవంగా జీవించే హక్కు లేకుండా పోయిందని ఆవేదన చెందారు. అంతేకాకుండా అరుంధతి ఔన్నత్యాన్ని కీర్తించారు. దళితక్రైస్తవులకు సదుపాయాలను కల్పించమని ప్రభుత్వానికి విన్నవించారు. **'దేశ రక్షణ'** ఖండికలో భారత్-చైనా యుద్ధాన్ని ప్రస్తావిస్తూ ప్రతి భారతీయుడు దేశ రక్షణ కోసం నడుం

బిగించాలని సూచించారు. **'త్యాగరాజు'** ఖండికలో వాగ్గేయకారుడైన త్యాగరాజును స్తుతించడమే ప్రధాన వస్తువు. **'ఎందుకు కన్నారు?'** ఖండికలో అనేక సమస్యలు, వివక్షలకు గురౌతున్న ఈ సమాజంలో మమ్మల్ని ఎందుకు కన్నారని తల్లిదండ్రులను ప్రశ్నించడం కన్పిస్తుంది. **'విశ్వ ప్రకాశం'** ఖండికలో క్రీస్తు జీవితాన్ని రేఖామాత్రంగా ప్రస్తావించి, ఆయనను విశ్వ ప్రకాశకుడిగా వర్ణించడం ప్రధానాంశం. ప్రత్యేకించి దళితులకు, దళిత క్రైస్తవులకు వారి హక్కులను వారికివ్వాలన్న అభ్యర్థన కన్పిస్తుంది. **'ఆంధ్రకేసరి'** ఖండికలో ఆంగ్లేయుల తుపాకీకి ధైర్యంగా తన గుండెను చూపించిన టంగుటూరి ప్రకాశం పంతులు గారికి నివాళి అర్పించారు. అలాగే, **'గురుదక్షిణ'** ఖండికలో ఏకలవ్యుని గురించి, **'సుప్రభాతం'** ఖండికలో క్రీస్తు ఏసుని ఏడుమాటలు, **'తెలుగుతల్లి'** ఖండికలో ప్రముఖ తెలుగుత కవుల, ప్రాంతాల వర్ణన, **'దీపావళి'** ఖండికలో దీపావళి పండుగ ప్రాశస్త్యం, **'ఆహుతి'** ఖండికలో మానవుల రక్షణార్థం మరణించిన ఏసు ప్రభువుని గురించి, **'తొలి ప్రధాని'** ఖండికలో నెహ్రూ ప్రశంస, **'అశ్రుధారలు'** ఖండికలో జాషువా కవిగారి మరణం, **'పంచాయితీ రాజ్యలక్ష్మి'** ఖండికలో గ్రామపంచాయితీలు ఉండవలసిన తీరుతెన్నులు, **'కొత్త సంవత్సరం'** ఖండికలో నూతన సంవత్సరం పట్ల ఆనందం, **'రాధాకృష్ణ పండితుడు'** ఖండికలో సర్వేపల్లి రాధాకృష్ణ గారి ప్రశంస కన్పిస్తాయి. ఈ విధంగా పలు అంశాలను వస్తువుగా స్వీకరించి 20 ఖండికలలో వివిధ అంశాలను ప్రస్తావించారు.

**అతుకుల బ్రతుకులు (1981)**

ఇది ఖండకావ్య సంపుటి. ఇందులో **'అతుకుల బ్రతుకులు'**, **'అత్యవసర పరిస్థితి'**, **'వరకట్నం'**, **'బుద్ధ జయంతి'**, **'త్రాగుబోతు'**, **'తెలుగు సంస్కృతి'**, **'ఉపాధ్యాయుడు'**, **'సమానత్వము'**, **'ఉగాది'**, **'హరిజనాభ్యుదయం'** అను పది ఖండికలున్నాయి. వీటిలో 'అతుకుల బ్రతుకులు', 'త్రాగుబోతు' రెండు కథాఖండికలు. వీటిలో పేకాట, త్రాగుడు మొదలగు వాటి వలన కలిగే అనర్థాలను వివరించారు. మిగిలిన ఖండికల్లో కవిగారు వివిధ అంశాలను తీసుకుని తన అభిప్రాయాలను చెప్పడం ఉంది.

**'అతుకుల బ్రతుకులు'**లో సీతాలు, జోగులు భార్యాభర్తలు. జోగులు పేకాట, త్రాగుడు మొదలగు వ్యసనాలకు బానిస. ఒకరోజు జోగులు భిక్షమెత్తుకొను అవిటివానిని చూచి ఇది మంచి వ్యాపారమని తలంచి, తన ఏకైక కొడుకు కాళ్ళు విరిచి భిక్షక వృత్తిలో పెట్టాలని భావిస్తాడు. ఆ విషయాన్ని ముందుగా తెలుసుకున్న భార్య సీతాలు తన పుత్రుని దూరంగా కొండమీద ఉన్న దేవాలయంలో విడిచి పెడుతుంది. ఆ తరువాత ఆ బాలుడు దైవదర్శనానికి వచ్చిన ధనవంతులకు దొరుకుతాడు. వారు ఆ బాలుని పెంచి పెద్దచేసి డాక్టరుని చేస్తారు. ఇలా కొంతకాలం గడచిన తరువాత ఒకరోజు జోగులు లారీ క్రిందపడి ప్రమాదానికి గురౌతాడు. సీతాలు భర్తను ఆసుపత్రిలో చేర్పించడం, డాక్టర్ గారు జోగులు కాళ్ళు తీసివేయటం జరుగుతుంది. ఆ తరువాత ఆపరేషన్ చేసిన డాక్టరే తమ కొడుకని జోగులు, సీతాలు తెలుసుకొని సంతోషిస్తారు. అలతి, అలతి పదాలతో సాగిన ఈ కథ సరళంగా, ప్రబోధాత్మకంగా ఉంది. మచ్చుకు సీతాలు, జోగులు వాదనలలో ఈ విషయం గమనించగలరు.

'ఓసి! సీతాలు! బ్రతుకుట కొక్కదారి
కనబడె – మన కుమారుని కాలు విఱచి
కుంటినిన్ జేసి నడివీధి గూరుచుండ
బెట్టి నంజాలు – పైసలిట్టిట్టెరాలు' (పుట : 9)

……………………………………

……………………………………

"మానవుడెవ్వడైనను కుమారుని దుర్గతిపాలు జేయగా
బూనునె? నీకిదేల చెడు బుద్ధి జనించెను? నాదు బొందిలో
ప్రాణములుండ నీ పనికి పాల్పడ నిత్తునె? నీయకృత్యమున్
మానుట చాలమంచి:దభిమానము సిగ్గురవంత గల్గినన్" (పుట : 10)

**'త్రాగుబోతు'** కథా ఖండికలో మూర్తి అనే ఉద్యోగి త్రాగుడికి బానిసై ఉద్యోగం ఊడగొట్టుకుని, సంసారం చెల్లాచెదురు చేసుకుని చివరకు మరణించడం ఇతివృత్తం. సర్వము గుల్ల చేసుకున్న మూర్తికి చివర క్షణాలలో

"త్రాగుడు వలన గదా! లక్ష్మి వంటినా
యిల్లాలు దిగులుతో కుళ్ళిచచ్చె
త్రాగుడు వలన గదా! నా సుతులు నన్ను
బాసి దేశాంతర వాసులైరి
త్రాగుడు వలన కదా! కల్పతరువుతో
సమమైన యుద్యోగ మెగిరిపోయె
త్రాగుడు వలన గదా! నా శరీరమ్ము
కొలది కాలమునకే గుల్లయయ్యె

పరువుపోయె, ఋణమ్ముల పాలబడితి
యాచకుడనైతి, నారోగ్యమంతరించె
మేను విడువనుంటిని – పగవానికేని
వలదు వలదయ్య మద్యసేవనము వలదు' అని కనువిప్పు కలుగుతుంది.

**'అత్యవసర పరిస్థితి'** ఖండికలో 1975లో విధించిన అత్యవసర పరిస్థితి వలన ఉద్యోగులు తమ ఉద్యోగ నిర్వహణ సక్రమముగా చేసినట్లు పేర్కొన్నారు. **'వరకట్నమ'**నే ఖండికలో 'కన్యనడుగు పట్ల కట్నాల బేరము చేయదగునే' అని ప్రశ్నించారు. **'బుద్ధజయంతి'** ఖండికలో బుద్ధుని జీవిత చరిత్ర స్థూలంగా పరిచయం చేశారు. **'తెలుగు సంస్కృతి'** ఖండికలో పాశ్చాత్య సంప్రదాయం వల్ల ప్రజల్లో వచ్చిన మార్పులు వివరించారు. **'ఉపాధ్యాయుడు'** ఖండికలో పల్లెటూరిలో ఉన్న ఉపాధ్యాయునికి గల కష్టాలు తెలియజేసారు. **'సమానత్వం'**

ఖండికలో అంటరానితనం మాసిపోతుందని, రాబోయే కాలంలో అందరూ సుఖిస్తారని ఆశించారు. **'ఉగాది'** ఖండికలో నిత్య యుగాదుల వల్ల సుఖములెన్నో గలవని తృప్తి చెందారు. **'హరిజనాభ్యుదయం'** ఖండికలో వయోజన విద్యవలన హరిజనుల జీవన విధానం మారిందని తృప్తిచెందారు. ఇలా ఈ కావ్యం వివిధ అంశంతో సాగింది.

ఆంధ్రప్రదేశ్‌లో పౌరాణిక ఇతివృత్తాలతో కూడిన పద్యనాటకాలు వీర విహారం చేస్తున్నప్పుడు వాటికి ధీటుగా బైబిల్ కథాంశంతో **'సాంసన్-దెలీలా'** (1963) అను పద్యనాటకాన్ని రచించారు. ఇందులో సంసోను-దెలీలా ప్రధాన పాత్రలు. ఈ నాటకం ఆంధ్రదేశంలో కొన్నివేలసార్లు ప్రదర్శించబడింది.

ఏసుక్రీస్తు త్యాగం, ప్రేమ, శాంతి, దయాగుణాలు మొదలగు అంశాలను వివరించే క్రైస్తవ ఇతివృత్త కావ్యం **'కాంతిరేఖలు'** (1987).

ఈ విధంగా మల్లవరపు జాన్ గారి రచనలను పరిశీలించినప్పుడు రచనలన్నీ ఆనాటి సమాజానికే పరిమితం కాకుండా ఈనాటి సమాజానికి కూడా అన్వయించుకునే విధంగా ఉన్నాయి. ఎందుకంటే ఆయన రచనలలో కులాంతర వివాహాలు, స్త్రీల అణచివేత, వరకట్నం, సాంఘిక సంక్షేమం, హరిజనాభ్యుదయం, లంచగొండితనం, పేదరికం, మద్యపానం, అధికజనాభా, కుటుంబనియంత్రణ, అవిద్య, అవినీతి మొదలగు అనేక అంశాలు తన కవితావస్తువులుగా ఉండటమే.

ఆయన కవిత్వ స్వరూప స్వభావాలను సునిశితంగా పరిశీలించినప్పుడు జాషువా ప్రభావం అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. అందుకే 'అతుకుల బ్రతుకులు' కావ్యానికి పీఠిక రాసిన పద్మశ్రీ సి. నారాయణరెడ్డి గారు ఆయన గురించి

'ఎదుగుతున్న మీ పలుకును చూస్తూవుంటే
ఇరుగట్టులను ఒరుసుకొని పారే
మీ ఝరీ కవితను గమనిస్తూ వుంటే
ఎంత ఆనందం కలిగిందో చెప్పనా?
ఆత్మీయుడు **జాషువా** వచ్చి
నా గుండెను తడుతున్నాడా
అనిపించింది" అంటూ జాషువాను, జాన్ కవిని పోల్చారు. అలాగే ప్రముఖ కవులైన దివాకర్ల వెంకటావధాని, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, దాశరధి కృష్ణమాచార్యులు, 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్య శాస్త్రి మొదలగు అనేక సుప్రసిద్ధ కవుల ప్రశంసలు అందుకున్నారు. అందరిచేత మెప్పుపొందిన ఈ రచయితకు తెలుగు సాహిత్యంలో వీరికి రావాల్సినంత గుర్తింపు రాలేదని చెప్పక తప్పదు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్యం - హరిజన రచయితల సేవ, డా॥ వై. విజయానందరాజు. అముద్రితం.
2. దళిత సాహిత్య చరిత్ర, డా॥ పిల్లి శాంసన్, 2000.
3. హరిజనాభ్యుదయం - ఆధునికాంధ్ర కవిత్వం, డా॥ కల్లూరి ఆనందరావు, 1994

****